క్లుప్తంగా

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోండి



చిన్నారులతో అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ లక్ష్మి ప్రసన్న తెలిపారు. మండల పరిధిలోని పాలవాయి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. ఐదు సంవత్సరాలు నిండి ప్రైమరీ స్కూల్‌కు వెళ్తున్న చిన్నాలరులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు.

మలేరియా, డెంగీ నివారణకు కృషి



వసతి గృహం వద్ద స్ప్రేయింగ్ చేయిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: మలేరియా, డెంగీ, చికున్ గున్యా లాంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు కట్టడి చేద్దామని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ తిరుపాలయ్య పిలుపునిచ్చారు. బుధవారం కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 29 ప్రభుత్వ వసతి గృహాల్లో ఆయన ఐఆర్ఎస్ మలాథియాన్ డబ్ల్యూడీపీ 25 శాతం స్ప్రేయింగ్ చేయించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గంగరాజు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగరాజు, ఏఎన్ఎం సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల ఆత్మహత్యలు కనిపించవా?



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

ఉరవకొండ: కూటమి ప్రభుత్వానికి కౌలు రైతుల ఆత్మహత్యలు కనిపించడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర రాక ఆత్మహత్య చేసుకున్నా పట్టించుకోవడం లేదని కౌలు రైతు సంఘం నాయకులు మండిపడ్డారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, పెద్దముస్తూరు వెంకటేష్ మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి చాలా మంది కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. పొగాకు, మిర్చి రైతులకు గిట్టుబాటు ధర అందక పంటకు పెట్టిన పెట్టుబడులు దక్కడం లేదని తెలిపారు. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకుని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడి హేయం



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని విజయవాడలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులపై పోలీసులు దాడి చేయడం హేయమైన చర్య అని జిల్లా కోశాధికారి ఆంజనేయులు విమర్శించారు. పోలీసుల తీరును ఖండిస్తూ బుధవారం రాయదుర్గంలోని వినాయక సర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. విద్యా దోపిడీ ఆపాలని ధర్నా చేస్తే పోలీసులతో అడ్డగించడం ప్రభుత్వానికి విద్యారంగంపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజు, సచిన్, అక్బర్, కార్తీక్, హుస్సేన్, కిరణ్, రాజేష్ పాల్గొన్నారు.

వ్యక్తి మృతి



మృతుడు వెంకటప్ప

బొమ్మనహాళ్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఉరవకొండ మండలం ఆమిదాల గ్రామానికి చెందిన మారాశి వెంకటప్ప (45) ఈ నెల 12న బొమ్మనహాళ్ మండలం కల్లుదేవనహళ్లిలో తన కూతురు ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి స్వగ్రామానికి బయల్దేరిన సమయంలో తారకాపురం వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ కమల్‌బాషా తెలిపారు.

ఆర్డీటీ లేకపోతే అభివృద్ధికి ఆటంకం

- ఆర్డీటీని కాపాడుకోవడమే ధ్యేయంగా పాదయాత్ర
- రాజకీయాలు చేయడానికి నాలుగేళ్ల సమయం ఉంది
- 15వ రోజు పాదయాత్రలో మాజీ ఎంపీ తలారి రంగయ్య



మల్లికార్జునపల్లిలో 200 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా మొక్క నాటుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, తిప్పేస్వామి, ఉమా



బోరంపల్లిలో పాదయాత్ర చేస్తున్న మాజీ ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం/కళ్యాణదుర్గం రూరల్: 'ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ లేకపోతే ఈ ప్రాంతం కుంటు పడుతుందనే నా ఆవేదన. ఆర్డీటీ కోసమే నా పోరాటం' అని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు డాక్టర్ తలారి రంగయ్య స్పష్టం చేశారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కోసం తలారి రంగయ్య చేస్తున్న పాదయాత్ర బుధవారం 15వ రోజుకు చేరుకుని 205 కిలో మీటర్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా 200 కిలో మీటర్ల ప్రాంతం వద్ద తలారి రంగయ్య మొక్కను నాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్డీటీ సంస్థను కాపాడుకోవడం కోసమే పాదయాత్ర చేస్తున్నానని తెలిపారు. రాజకీయాలు చేయడానికి ఇంకా నాలుగేళ్ల సమయం ఉందన్నారు. పాదయాత్ర ప్రారంభమైన గొంచి తండాలో ఆర్డీటీ, జాతీయ జెండాలను భుజాన వేసుకుని నడుస్తుంటే పాదయాత్రను అడ్డుకుని అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులు తనను తాకకుండా ప్రజలే పాదయాత్రను ముందుకు నడిపించారన్నారు. తాను కేవలం ఈ ప్రాంతం బాగుపడాలని, పేద ప్రజలు బాగుండాలనే పాదయాత్ర చేస్తున్నానని పేర్కొన్నారు. జిల్లాలో ఆర్డీటీ సేవలు నిలిచిపోతే ముందుగా ఎస్సీ, ఎస్టీ, బీసీలే అధికంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ పేదల పార్టీ కాబట్టే పార్టీ మద్దతుతో పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కోసం ఢిల్లీ వెళ్లాల్సిన పని లేదన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక వచ్చిందని, కేంద్రం కూడా కదలాల్సి ఉందన్నారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ చేయకపోతే కేంద్రానికి నూకలు చెల్లే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఆర్డీటీ సేవలు పూర్తిగా నిలిచిపోతే విద్య, వైద్యం, వ్యవసాయం లాంటి సేవలు లేక పేదలు తీవ్రంగా నష్టపోతారన్నారు. పేద ప్రజల ఓట్లతో గెలిచిన కూటమి నేతలు ఆర్డీటీని లేకుండా చేస్తున్నారని విమర్శించారు. తాను చేస్తున్న పాదయాత్ర కూటమి నేతలకు మింగుడు పడటంలేదన్నారు. ఈనెల 19న పాదయాత్ర ముగింపు సభకు కూడా అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వరనాయుడు, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, జెడ్పీటీసీ బొమ్మయ్య, ఎంపీపీలు మారుతమ్మ, నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు తిప్పేస్వామి, ప్రతాప్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

బోరంపల్లి నుంచి మొదలు..

మాజీ ఎంపీ తలారి రంగయ్య బుధవారం ఉదయం బోరంపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. చాపిరి, హులికల్లు, విట్లంపల్లి, మల్లికార్జునపల్లి, గూబనపల్లి గ్రామాల వరకూ యాత్ర సాగింది. ఆయా గ్రామాలలో మహానేత వైఎస్సార్ , వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేస్తూ పాదయాత్ర సాగింది. చాపిరిలో ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా బుద్ధి ప్రసాదించాలని ఫాదర్ విగ్రహం వద్ద ప్రార్థించారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రఘునాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ములకనూరు తిమ్మరాయుడు, యర్రంపల్లి కృష్ణమూర్తి, గోపాల్‌రెడ్డి, డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షులు బొమ్మయ్య, మున్సిపాలిటీ కన్వీనర్ ఐ సుధీర్, పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వివిధ మండలాల కన్వీనర్లు గోళ్లసూర్యనారాయణరెడ్డి, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజినేయులు యాదవ్, దొడగట్ట నారాయణ, సత్తి, పాతలింగ, అభిలాష్ రెడ్డి, పిల్లలపల్లి అంజి, కామక్కపల్లి మల్లి, చరణ్, శ్రీకాంత్, బిక్కిహరి, ఎస్.తిప్పేస్వామి, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, ముదిగల్లు సత్తి రెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మన్న, కో ఆప్షన్ అఫ్జల్, ఈ.రాము, నాగలక్ష్మి, కాంతమ్మ, సునీత, వైస్ ఎంపీపీ హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు, అనంత జిల్లా నేతల సంఘీభావం

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ కోసం మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రకు సంఘీభావంగా నెల్లూరు జిల్లా కొవ్వూరు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టిపాటి నరేంద్రరెడ్డి, నాయకులు షేక్ షబ్బీర్, కిరణ్, రాజా, అమర్‌నాథ్‌రెడ్డిలు తమ సంఘీభావం తెలిపారు. అలాగే అనంతపురం రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్ రెడ్డి, శీనా, డాక్టర్ వీరప్ప, నాగలింగయ్య, టీయూ చంద్రమోహన్, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌యాదవ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు భంగి శివ, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు వేమన్న, పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి బండారు శంకర్, విప్లవ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్, కార్యదర్శి నిశాంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుల్తాన్ ఆదాం , రాహుల్‌రెడ్డి, ఫయాజ్, రజాక్‌లు పాదయాత్రకు మద్దతు తెలిపారు.



చాపిరిలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ రంగయ్య, నేతలు



రంగయ్య పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న నెల్లూరు వైఎస్సార్‌సీపీ నేతలు



హులికల్లులో రంగయ్యకు గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

పంట రుణాల రెన్యూవల్‌కు అవస్థలు



ఖాతాదారులకు సర్దిచెబుతున్న బ్యాంకు అధికారులు

బెళుగుప్ప: యూనియన్ బ్యాంకులో సిబ్బంది కొరతతో పంట రుణాల రెన్యూవల్‌కు రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం బ్యాంకులో ఎనిమిది మంది అధికారులు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే ఇద్దరు ఆఫీసర్లు, ఇద్దరు క్లర్క్‌లు మాత్రమే ఉన్నారు. బ్యాంక్ మేనేజర్ సైతం శిక్షణ కార్యక్రమాలకు సెలవులో వెళ్లారు. సుమారు 30 వేల బ్యాంక్ ఖాతాలు, పంట రుణాల ఖాతాలు, సుమారు 400 మహిళా సంఘాల రుణాల ఖాతాలు, మరో 1,000 టర్మ్ లోన్‌లు కలిగిన ఖాతాదారులకు సేవలు అందించాల్సి ఉంది. నిత్యం వందల సంఖ్యలో ఖాతాదారులు బ్యాంకుకు రావడంతో పూర్తి స్థాయిలో సేవలు అందించలేకపోతున్నారు. సమస్యపై ఇన్‌చార్జ్ బ్యాంక్ ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు లేకుండా ఉన్న సిబ్బందితోనే రాత్రి 8 గంటల వరకు బ్యాంకులోనే ఉండి సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది కొరత విషయంపై బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాలపై ఆర్డీఓ విచారణ



బీటీపీ లేఅవుట్‌లో విచారణ చేస్తున్న ఆర్డీఓ వసంతబాబు

రాయదుర్గం: పట్టణంలోని గౌడ, బీటీపీ, మల్లాపురం ఇందిరమ్మ కాలనీల్లో పుట్టుకొచ్చిన నకిలీ పట్టాల బాగోతంపై 'సాక్షి' ప్రచురించిన వరుస కథనాలకు కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు బుధవారం ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ రామాంజనేయులు, వీఆర్వో చిత్తయ్య ఇతర సిబ్బందితో కలసి ఆయా లేఅవుట్లను సందర్శించారు. అక్కడ ఉన్నవారి పట్టాలను రికార్డులతో పోల్చి చూశారు. అనంతరం రిజర్వు స్థలాలను తనిఖీ చేశాక ఆర్డీఓ మాట్లాడారు. తహసీల్దార్ సంతకాలు ఫోర్జరీ చేసి బోగస్ పట్టాలు సృష్టించిన ముఠాపై ఆరా తీయాలన్నారు. దీని వెనక ఎవరున్నా క్రిమినల్ కేసులు నమోదు చేయించాలన్నారు. నకిలీ పట్టాల తయారీ ముఠాకు సహకరించిన రెవెన్యూ సిబ్బందిపై లోతుగా విచారణ జరిపి చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. అర్హుల స్థానాల్లో అనర్హులు ఎంతమంది ఉన్నారో గుర్తించాలన్నారు. రికార్డుల్లో లేని పట్టాల సంఖ్య తేల్చి జాబితాను కార్యాలయానికి పంపాలన్నారు. స్థలాలు తీసుకుని ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాని వారికి జారీ చేసిన నోటీసులపై వివరణ తీసుకోవాలన్నారు. కబ్జాకు గురైన రిజర్వుస్థలాలను పరిరక్షించి కంచె ఏర్పాటుకు మున్సిపల్ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. రెవెన్యూ రికార్డుల్లో పేర్లుండే వారికే అవకాశం కల్పించాలని ఆదేశించారు. దౌర్జన్యంగా బేస్‌మట్టాలు నిర్మించుకుని ఉంటే చట్టపరంగా చర్యలు చేపట్టాలన్నారు.

కాసరతో ఆరోగ్యం పదిలం



రాయదుర్గంటౌన్: కాసర (చిన్నకాకర) కాయలు అంటే రాయలసీమ వాసులకు భలే ఇష్టం. వర్షాకాలంలో విరివిగా లభించే వీటికి మంచి డిమాండ్ ఉంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కాసర కాయలను రాయదుర్గంలో కిలో రూ.200తో విక్రయిస్తున్నారు. కాసరకాయలో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఐరన్, క్యాల్షియం, ఫైబర్ లాంటి ఔషధ గుణాలు పుష్కలంగా కలిగి ఉంటాయి. ఇందులో దాగి ఉన్న క్యాల్షియం, ఐరన్ శరీరంలోని కండరాలను బలోపేతం చేయడంతోపాటు ఎముకల ధృడత్వానికి దోహదపడుతాయి. దీంతోపాటు మిటమిన్ సీ, క్యాల్షియం, బీటా కెరోటిన్, పోటాషియం, జింక్ వంటి అనేక రకాల పోషకాలు లభిస్తాయి. మధుమేహాన్ని నియంత్రించడంలోనూ ఇవి సహాయపడతాయి. బరువు తగ్గాలనుకున్న వారికీ కాసరకాయలు ఉపకరిస్తాయి.

ఆధునికీకరణ పనులు వేగవంతం చేయాలి



కణేకల్లు చెరువు అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ పనులను పరిశీలిస్తున్న ఈఈ, డీఈఈలు

కణేకల్లు: తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ పరిధిలో రూ.35.06 కోట్లతో జరుగుతున్న ఆధునికీకరణ పనులను హెచ్చెల్సీ ఈఈ పార్థసారథి బుధవారం పరిశీలించారు. కణేకల్లు హెచ్చెల్సీ సబ్‌డివిజన్ డీఈఈ దివాకర్‌రెడ్డితో కలిసి ఆయన 115వ కిలోమీటర్ నుంచి 189వ కిలోమీటర్ వరకు జరుగుతున్న బ్రిడ్జి, యూటీ, కణేకల్లు చెరువు అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ పనులను తనిఖీ చేశారు. జూలైలో హెచ్చెల్సీకి నీటి విడుదల కానున్నందున పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఈఈ ఆదేశించారు. అత్యవసరమైన పనుల నిర్వహణపై కాలయాపన చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఏఈఈలు నరేంద్రమారుతి, అల్తాఫ్ పాల్గొన్నారు.



పందుల స్వైర విహారం

ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలో గత కొన్ని నెలలుగా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఏ కాలనీలో చూసినా పందుల సంఖ్యలో పందుల గుంపులు సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మేజర్ పంచాయతీ పరిధిలో 20 కాలనీలు ఉండగా.. 9,755 గృహాలు ఉన్నాయి. పట్టణంలో దాదాపు 600 వీధులు ఉండగా ప్రస్తుతం ఏ వీధిలో చూసినా పందులు, వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. దీనికి తోడు పారిశుధ్యం లోపించడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. చిన్నకొండ, ఇందిరా నగర్, పదో వార్డుతో పాటు మరికొన్ని వీధుల్లో పందుల బెడద అధికమైంది. జనావాసాల మధ్య పందులు తిరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పందులను తరలించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు. – ఉరవకొండ:



కమ్మూరు రోడ్డు క్రాస్ వద్ద బస్ షెల్టర్ పైకప్పు రేకులను ఎత్తుకెళ్లిన దృశ్యం

రేకులు లేక అవస్థలు

కూడేరు మండల పరిధిలోని కమ్మూరు రోడ్డు క్రాస్ వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి పక్కన ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. కానీ గుర్తు తెలియని వ్యక్తులు షెల్టర్ పైకప్పు, పక్కన ఏర్పాటు చేసిన రేకులు కొన్నింటిని ఎత్తుకెళ్లారు. కొన్ని గాలికి కొట్టుకుపోయాయి. ఎండ, వానకు షెల్టర్‌లో ప్రయాణికులు కూర్చొలేకపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బస్ షెల్టర్ పైకప్పునకు రేకులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – కూడేరు:

విద్యుత్‌శాఖలో పెచ్చుమీరుతున్న అవినీతి

- డబ్బు కట్టించుకుని బిల్లు ఇవ్వని లైన్‌మెన్
- రసీదు అడిగితే దుర్భాషలాడిన వైనం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం విద్యుత్‌శాఖ కార్యాలయంలో అధికారుల అవినీతి పెచ్చుమీరుతోంది. ఇటీవల ఏడీ గురురాజ్, ఏఈ సలీం మధ్య దూషణల పర్వం జిల్లాస్థాయి అధికారులకు చేరింది. దీంతో ఏఈ సలీంను బదిలీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి రెండు రోజుల క్రితం రూ.1302 కరెంటు బిల్లును ఫోన్ పే ద్వారా లైన్‌మెన్ విజయ్ అకౌంట్‌కు జమ చేశాడు. బుధవారం మరో వ్యక్తి సదరు వినియోగదారుడికి ఫోన్ చేసి కరెంటు బిల్లు కట్టనందున కరెంటు కట్ చేస్తున్నామని తెలపడంతో వెంటనే లైన్‌మెన్ విజయ్‌కు ఫోన్ చేశాడు. డబ్బు కట్టించుకుని బిల్లు ఇవ్వమని వినియోగదారుడు అడగ్గా ఫోన్‌లోనే ఇష్టానుసారం దుర్భాషలాడాడు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. సదరు బాధితుడు విద్యుత్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపినా .. ఉన్నతాధికారులను సైతం దుర్భాషలాడటం చర్చనీయాంశమైంది.

పాదయాత్రకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ

రాయదుర్గంటౌన్: ఆర్డీటీ పరిరక్షణ కోసం మాజీ ఎంపీ తలారి రంగయ్య చేస్తున్న పాదయాత్రకు బుధవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ తన సంపూర్ణ మద్దతు తెలియజేశారు. పాదయాత్రలో పాల్గొని కరువు పీడిత ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాకు కల్పతరువు లాంటి ఆర్డీటీ సంస్థను కాపాడుకునేందుకు రంగయ్య పాదయాత్ర చేస్తుండడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్సును రెన్యూవల్ చేసి నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హై ఓల్టేజీ ఘటనపై ఏడీ ఆరా



పాడైన ఫ్రిజ్‌ను పరిశీలిస్తున్న ఏడీ భాస్కర్, ఏఈఈ శంకర్‌నాయక్

కణేకల్లు: మండల కేంద్రం కణేకల్లులోని ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ హై ఓల్టేజీ ఘటనపై ఉరవకొండ ఏడీ భాస్కర్ ఆరా తీశారు. ఏఈఈ శంకర్‌నాయక్‌తో కలిసి బుధవారం ఆయన ఇందిరమ్మకాలనీని సందర్శించారు. హై ఓల్టేజ్ కారణంగా ఇళ్లలో పాడైపోయిన విద్యుత్ ఉపకరణాలను పరిశీలించారు. సోమవారం రాత్రి ఒక్కసారిగా హై ఓల్టేజ్ విద్యుత్ సరఫరా కావడంతో ఫ్రిజ్‌లు, స్టెబిలైజర్లు, ఫ్యాన్‌లు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. తమకు పరిహారం వచ్చేలా చూడాలని విన్నవించారు. ఎవరెవరికీ ఎంత నష్టం జరిగిందనే విషయాన్ని ఏడీ అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు. ప్రతి ఇంటికి ఎంసీబీ (మ్యానేచర్ సర్క్యూటర్ బ్రేకర్) వేసుకోవాలని, ఆకస్మాత్తుగా హై ఓల్టేజ్ వస్తే ఆటోమేటిక్‌గా ఆది స్విచాఫ్ అవుతుందని, తద్వారా కరెంటు సరఫరా ఆగిపోతుందని తెలిపారు. గాలికి ఎల్‌టీ లైన్‌లు ఒకదానికొకటి తగలడం వల్ల 440 వాట్స్ కరెంటు సరఫరా అయి ఇళ్లలోని ఎలక్ట్రిక్ పరికరాలు పాడయ్యాన్నారు. మరోసారి ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకొంటామని ఆయన చెప్పారు.

పెట్రోల్ బంకుల్లో మోసాలు అరికట్టాలి



పెట్రోల్‌లో నీరు కల్తీ అయిందని చూపుతున్న మల్లికార్జున

రాయదుర్గంటౌన్: పెట్రోల్ బంకుల్లో కల్తీ మోసాలపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. పట్టణంలోని లక్ష్మీ బజార్‌లో ఉన్న పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోస్తున్నారా? లేక నీరు పోస్తున్నారా అని ప్రశ్నించారు. బుధవారం ఉదయం తన ద్విచక్రవాహనానికి పెట్రోల్ పట్టించగా కొంత ముందుకు వెళ్లిన తర్వాత ఆగిపోయిందన్నారు. బైక్ స్టార్ట్ కాకపోవడంతో మెకానిక్‌కు చూపించగా పెట్రోల్‌లో నీరు కల్తీ అయిన విషయం గుర్తించినట్లు చెప్పారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో బంకుల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిన్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని కోరారు.

పుస్తకాల పంపిణీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పంపిణీ చేశారు. అలాగే ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు తెలిపారు.

చదువులో రాణించాలి

గుమ్మఘట్ట: ప్రతి విద్యార్థీ చదువులో రాణించాలని తహసీల్దార్ రజాక్‌వలి, ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. బుధవారం పూలకుంటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన బతుకులను, జీవితాన్ని మార్చేది విద్య ఒక్కటేనన్నారు. ఎంచుకున్న లక్ష్యాలు నెరవేరేంత వరకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హనుమంతరాయుడు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.